
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025

కొనేవారు లేక..

రోడ్డుపక్కన పడేసిన టమోటాలు



అధిక వర్షాలకు టమోటాకు మచ్చ తెగులు సోకి రైతుకు తీవ్ర నష్టం మిగుల్చుతున్నాయి. మచ్చల కాయలను మార్కెట్‌లో కొనేవారు లేరు. ఓ రైతు మచ్చ తెగులు సోకిన టమోటా దిగుబడిని మార్కెట్‌కు తీసుకెళ్లాడు. కొనేవారు లేకపోవడంతో రొద్దం మండలంలోని బొక్సంపల్లి సమీపాన పెనుకొండ-పావగడ ప్రధాన రహదారి పడేసి వెళ్లాడు. మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో రూ.20 పలుకుతోంది.

-రొద్దం(ఆంధ్రజ్యోతి)

కన్నీళ్లు మిగిల్చిన కర్బూజ..!

● చీడపీడలతో నట్టేట మునిగిన రైతులు ● కన్నెత్తి చూడని ఉద్యానశాఖ అధికారులు

గాండ్లపెంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కర్బూజ పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట బాగా వస్తుందని ఆశించిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. గాండ్లపెంట మండలంలోని కత్తివారిపల్లి, సోమయాజులపల్లి, యనుములవారిపల్లి, వేపరాల, జీన్లకుంట, కోటవాండ్లపల్లి, కొట్లపల్లి, గాండ్లపెంట, కటారుపల్లి రైతులు కర్బూజ పంటను అధికంగా సాగుచేస్తారు. ఈ ఏడాది జూన్, జూలైలో పంట సాగుచేసిన రైతులకు మంచి దిగుబడి, ధర కూడా వచ్చాయి. దీంతో పలువురు రైతులు కర్బూజా సాగుకు మొగ్గు చూపారు. 60 నుంచి 70 రోజుల్లో పంట చేతికొస్తుంది. రెండు నెలలు కష్టపడితే ధరలు నిలకడగా ఉండి, అధిక దిగుబడులు వస్తే కష్టాల నుంచి గట్టెక్కవచ్చని అన్నదాతలు భావించారు. మండల వ్యాప్తంగా ఆగస్టులో 500 ఎకరాలకుపైగా కర్బూజా సాగుచేశారు. నాలుగు రోజులకోసారి క్రిమిసంహారక మందులు కూడా వాడుతున్నారు. పంటలు తెగుళ్లబారిన పడి రైతులు నష్టపోతున్నా ఉద్యానశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. చేసేది లేక రైతులు క్రిమి సంహారక మందుల దుకాణ యజమానులు.. ఇచ్చే మందులను పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. కర్బూజా పంట తీగలు పగిలిపోతున్నాయని, తెల్ల, పచ్చ దోమ, ఆకులను రసం పీల్చే పురుగుతో రోగాలబారినపడ్డాయని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో వందల ఎకరాలను తొలగించారు. ప్రస్తుతం కర్బూజా ధర కిలో రూ.20 నుంచి రూ.25 వరకు పలుకుతోంది. ఇలాంటి సమయంలో పంటను ఎలాగైనా గట్టెక్కించాలని ప్రయత్నించినా చేతికి రాకపోవడంతో లక్షల్లో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తెగుళ్ల బారిన పడిన కర్బూజ పంట

ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు



నేను మూడు ఎకరాలలో కర్బూజ పంట వేశాను. రూ. 2 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాను. పూత, పిందె దశలో తీగపగిలి, వివిధ రకాల రసం పీల్చే వ్యాధులు సోకాయి. వీటి నివారణ కోసం వేల రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకపోయింది. మంచి ధరలు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో.. కనీసం పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదు.

- రవీంద్రారెడ్డి, రైతు, కొట్టపల్లి

మా దృష్టికి రాలేదు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కర్బూజ పంట సాగు చేశారు. పంటకు వ్యాధులు సోకిన విషయం రైతులు మా దృష్టికి తీసుకురాలేదు. ఎవరైనా పంటలకు చీడపీడలు సోకాయని మా దృష్టికి తీసుకు వస్తే పరిశీలించి సలహాలు ఇస్తాం.

- ప్రతాపరెడ్డి, ఉద్యానశాఖ అధికారి


పంటను తొలగించేశా



మంచి ధరలు ఉన్నాయనే ఆశతో రెండు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశాను. రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. బాగా పూత, పిందె దశలో ఉన్నప్పుడు తెగుళ్లు వ్యాపించాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా చీడపీడలు పోలేదు. దీంతో పంటను తొలగించేశా. ఉద్యాన పంటలకు అధికారుల సలహాలు, సూచనలు కూడా లేకపోవడంతో నష్టాల బారిన పడుతున్నాం.

- త్రివేంద్రారెడ్డి, రైతు, పోతవాండ్లపల్లి

3 నుంచి శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు



కదిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆర్జిత కల్యాణోత్సవాలు నవంబరు 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నవంబరు 3, 4, 6, 7, 9, 10, 11, 12, 13, 14, 16, 17, 21, 23, 24, 25, 26, 30 తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. వివరాలు ఆలయ పనివేళల్లో కార్యాలయంలో తెలుసుకోవాలని సూచించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం: ఎస్పీ



గుడ్డం ప్రాంతంలో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ

హిందూపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరస్తులు, రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని గుడ్డం ప్రాంతంలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ ద్వారా జల్లెడ పట్టారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేరస్తులున్న ప్రాంతాలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. రెండోసారి నేరం చేసే అవకాశం ఇవ్వమన్నారు. ప్రతి ఇంటినీ అవసరమైనపుడు సోదాలు చేస్తామన్నారు. గుడ్డం ప్రాంతంలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గతేడాది చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారంలో పట్టుబడిన నిందితులకు వారి ఇళ్లవద్దే కుటుంబ సభ్యులకు తనదైన స్టైల్‌లో వార్నింగ్ ఇచ్చారు. నేరస్తులు కోర్టు వాయిదాలలకు మాత్రమే హిందూపురానికి రావాలనీ, వేరేరోజుల్లో జిల్లాలో కనిపిస్తే తాట తీస్తామన్నారు. గుడ్డం ప్రాంతంలో ఉన్న నేరస్తుల ఇళ్లలో ఇద్దరు, ముగ్గురు నిందితులున్నారనీ, వారంతా వేరే ప్రాంతానికి వెళ్లి బతుక్కోవాలన్నారు. రికార్డులులేని 77 ద్విచక్రవాహనాలు, ఏడు ఆటోలను సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్‌లో డీఎస్పీలు మహేష్, నర్సింగప్ప, సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, సుబ్రహ్మణ్యం, రాజ్‌కుమార్, 120 మంది సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వడ్డెర్లకు ప్రాధాన్యం

● మంత్రి సవిత ● గోరంట్లలో ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ (7లో..)



వాల్మీకి జీవనమార్గాలను అనుసరించండి

● ప్రభుత్వ విప్ కాలవ, ఎంపీ అంబికా

● నూతన ఉపాధ్యాయులకు సన్మానం

7లో..

నేడు విగ్రహాల ఆవిష్కరణ

● మడకశిరకు రానున్న 20 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు

మడకశిరటౌన్/రొళ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ పరిధి బేగార్లపల్లిలో సోమవారం ఉదయం బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.. కార్యక్రమం నిర్వహణపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. 20 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు. ఉదయం 10 గంటలకు రొళ్ల మండలం రత్నగిరి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అక్కడి నుంచి బయలుదేరి బేగార్లపల్లిలో 11 గంటలకు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తామన్నారు. 11.30 గంటలకు బేగార్లపల్లి వద్ద బహిరంగ సభలో కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బడిలోనే భవితకు భరోసా..!

పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాకోర్సులు

73 పాఠశాలల్లో.. 9 రకాల కోర్సులకు శిక్షణ

సమగ్రశిక్ష శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

7లో..

వద్దన్నా డీజే.. టీడీపీ నేతలపై కేసు

ఆలస్యంగా వెలుగులోకి..

ఆర్చరీ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన ఆర్చర్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జిల్లా ఆర్చరీ సబ్‌జూనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఇండియన్ రౌండ్ విభాగంలో ధృవరెడ్డి, యజ్ఞరూప్ యాదవ్, పవన్‌కేశవ రెడ్డి, మిథున్, అయాన్, భీమేష్, లేక్యన్యరెడ్డి, తీక్షిత్, మనోజ్ఞ, వందన, తరుణిక, మణ్యశ్రీ ఎంపికయ్యారు. రికర్వ్ రౌండ్ విభాగంలో యోగేష్, ప్రజ్వల్, మహబూబ్‌బాషా, సాయిస్వరూప్, సంతోష్, గుణశ్రీ, శ్రీలేఖ, నిఖిత, ఆడియా ప్రియదర్శిని, ప్రియదర్శిని చోటు దక్కించుకున్నారు. కాంపౌండ్ విభాగంలో కార్తీక్, సల్మాన్, సూర్య, శ్యామ్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 1వతేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు నళిని, లక్ష్మీదేవి, రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువ కవికి లేపాక్షి ఫౌండేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

ధర్మవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన యువకవి గురు కాశీవిశ్వనాథ్‌కు లేపాక్షి ఫౌండేషన్ అవార్డు దక్కింది. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ యువకవి వడ్డి సుధాకర్ అధ్యక్షతన శనివారం తెలుగు సాహిత్యకళా ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో కాశీవిశ్వనాథ్ కవిత చదివి వినిపించారు. కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గండిశెట్టి శివకుమార్ యువకవికి లేపాక్షి ఫౌండేషన్ అవార్డు అందజేసి సత్కరించారు.

మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

అనంతపురం విద్య, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో మొక్కజొన్న పంటను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, అధ్యక్షుడు చెన్నయ్య యాదవ్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంత వరకు క్వింటాలు రూ.2,300 ఉన్న ధర ప్రస్తుతం రూ.1700కు పడిపోయిందని అన్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం అందక అప్పులపాలు కావాల్సి వస్తోందన్నారు. వేరుశనగ పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పప్పుశనగ విత్తనాన్ని 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు.

ఎమ్మెల్యే అమిలినేని మానవత్వం

రోడ్డుపై పడి ఉన్న వ్యక్తికి సాయం

ఆసుపత్రికి తరలించి చికిత్సలు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పడి ఉన్న ఓ వ్యక్తికి సాయం అందించి.. ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నారు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు. ఆదివారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని తూర్పుకోడిపల్లిలో వాల్మీకి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కాన్వాయ్‌తో వెళుతున్నారు. పట్టణంలోని రింగ్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి అచేతనంగా పడిఉన్నాడు. గమనించిన ఎమ్మెల్యే తన కాన్వాయ్‌ను ఆపి, వెంటనే ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేశారు. ఆ వ్యక్తి మాట్లాడలేకపోయాడు. వెంటనే తన వ్యక్తిగత సిబ్బందితో ఆ వ్యక్తికి నీళ్లు తాగించి, మాట్లాడే ప్రయత్నం చేశారు. కాసేపటికి ఆ వ్యక్తి మాట్లాడాడు. తన పేరు సురేష్ అని, మదనపల్లి నుంచి వచ్చానని, అనారోగ్యం కారణంగా ఇలా రోడ్డుపై పడిపోయానని తెలిపాడు. వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేక వాహనం తెప్పించి, కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి ఆ వ్యక్తిని తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడంతో ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

బుక్కరాయసముద్రం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీల పరంపర కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి మండలంలోని ఎస్ కొండాపురం గ్రామంలో గల ముత్యాలమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. అమ్మవారి ఆభరణాలు దాదాపు 70 వేలు విలువ చేసే 55 తులాల వెండి, హుండీలో ఉన్న రూ.20వేల మేర నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు.. ఆదివారం ఉదయం ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. చోరీపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మల్లయ్య (ఫైల్)

యాడికి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ఆదివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో పుల్లయ్య (53) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయలచెరువుకు చెందిన పుల్లయ్య స్థానిక ఆదర్శ పాఠశాలలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తుండేవాడు. ఆదివారం రాత్రి స్కూటీలో విధులకు వెళ్తుండగా వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆపకుండా వెళ్లిపోతున్న బొలెరో వాహన డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదేళ్ల బాలుడు అదృశ్యం



అదృశ్యమైన బాలుడు (ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అరుణోదయకాలనీకి చెందిన గోవిందు, అతడి భార్య శనివారం రాత్రి పని మీద బయటకు వెళ్లారు. బాబు నిద్రపోతుండటంతో.. ఇంట్లోనే ఉంచి సుమారు 20 నిమిషాల్లో పనినిమిత్తం వెళ్లి వచ్చేద్దామని వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూస్తే... బాబు కనిపించలేదు. బాలుడి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాలుడు కనిపించకుండా పోయినపుడు స్కైబ్లూ కలర్ టీషర్ట్, గ్రీన్ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9490618679, 9346917115 నంబర్లలో సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1350 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

బడిలోనే భవితకు భరోసా..!

- పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాకోర్సులు
- 73 పాఠశాలల్లో.. 9 రకాల కోర్సులకు శిక్షణ
- సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ



శిక్షణకు హాజరైన వృత్తి విద్యాకోర్సుల శిక్షకులు

అనంతపురం విద్య, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో చదువు ఒక్కటే ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో కల్పించలేకపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యాకోర్సులలో నైపుణ్యాలు నేర్పించాలని చర్యలు చేపట్టారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల పైచదువులకు ఉపయోగపడడంతో పాటు జీవితంలో స్వయం ఉపాధి పొందడానికి తోడ్పడుతాయి. ప్రభుత్వం వీటికి ప్రాధాన్యం ఇస్తూ.. అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసింది.

73 పాఠశాలల్లో అమలు

అనంత జిల్లాలో అధికారుల సమాచారం మేరకు 73 పాఠశాలల్లో వృత్తి విద్యాకోర్సులు అమలు చేస్తున్నారు. ఇందులో 19 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, 15 ఏపీ మోడల్ స్కూల్స్, ఆరు ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ స్కూళ్లు, 24 ఎంపీపీ, జడ్పీ స్కూళ్లు, రెండు మున్సిపల్, నాలుగు గవర్నమెంట్ సూళ్లు ఉన్నాయి. ఏపీఆర్‌ఈఐ సొసైటీ స్కూల్, ఏపీటీడబ్ల్యుఆర్‌ఈఐస్కూల్, బీసీవెల్ఫేర్ స్కూల్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇస్తారు.

9 కోర్సులు.. 127 మంది శిక్షకులు

వృత్తి విద్యా కోర్సులు అమలు చేస్తున్న 73 పాఠశాలలో.. 9 రకాల కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ అండ్‌వెల్నెస్, రిటైల్ వ్యాపారం, ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్, ఐటీ, ఆహార శుద్ధి, బీఎఫ్ఎస్ఐ అంశాలలో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. వృత్తి విద్యాకోర్సులలో నైపుణ్యాలు పెంచడం కోసం ప్రత్యేకంగా 127 మంది శిక్షకులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ 73 పాఠశాలల్లో 13,298 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సమగ్రశిక్ష శాఖ ఈ కోర్సులకు అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తోంది.

జీవిత ప్రయాణానికి ఉపయుక్తం



బాలబాలికల జీవిత ప్రయాణానికి ఈ వృత్తి విద్యాకోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అందుకే ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే వీటిని తీసుకొచ్చింది. జిల్లాలో 73 స్కూళ్లలో వీటిని నిర్వహిస్తున్నాం. చదువు పూర్తయ్యేసరికి ఈ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకొని ధ్రువపత్రాలతో బయటకువస్తారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

-శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

బ్యూటీ కోర్సుతో ఉపాధి



బాలికలకు ప్రస్తుత సమయంలో బ్యూటీ వెల్నెస్ ఒకేషనల్ కోర్సు ఎంతో ఉపయోగం. వారు తమ పరిసర ప్రాంతాల్లోనే బ్యూటీ పార్లర్, లేడీస్‌కార్నర్, ఫ్యాన్సీ షాపులు పెట్టుకొని ఉపాధి పొందవచ్చు. ఇంట్లోనే ఉంటూ వీటిని నడుపుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈ కోర్సుల పట్ల అమ్మాయిలు ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా అదేస్థాయిలో శిక్షణ ఇస్తున్నాం.

-సుజాత, బ్యూటీ శిక్షకురాలు, రాయదుర్గం

కంప్యూటర్ స్కిల్స్ అవసరం



ప్రస్తుత సాంకేతిక రంగంలో కంప్యూటర్ స్కిల్స్ చాలా అవసరం. అందుకే ప్రభుత్వం ఐటీ కోర్సులను అమలుచేస్తోంది. విద్యార్థులకు ఐటీ రంగంలో నైపుణ్యం నేర్పించడం వల్ల స్కూల్ స్థాయి నుంచే అవగాహన ఏర్పడుతుంది. డిప్లమో, బీటెక్, డిగ్రీ చేరిన తర్వాత ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి. వృత్తి విద్యా కోర్సుల వల్ల విద్యార్థులు తమ సొంతకాళ్లపై నిలబడడానికి అవకాశం ఉంటుంది.

-నిరంజన్‌రెడ్డి, శిక్షకుడు

స్థానిక ఎన్నికల్లో వడ్డెర్లకు ప్రాధాన్యం

మంత్రి సవిత

గోరంట్లలో ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

హిందూపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు పార్టీ నామినేటెడ్ పదవుల్లో వడ్డెర్లకు ప్రాధాన్యత కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గోరంట్లలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత.. వడ్డెర్ల సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. బీసీలకు టీడీపీతోనే రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ప్రాధాన్యత లభిస్తుందన్నారు. రేనాటి యోధుడు, ఆంగ్లేయుల దాష్టీకాలను ఎదురించి మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలికిన వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. బీసీల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. క్వారీ కేటాయింపుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్‌తోపాటు సీనరేజ్ ఫీజులపై 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. వడ్డెర్లను ఎస్టీల జాబితో చేర్చే అంశం చంద్రబాబు దృష్టిలో ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర్‌రావు, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, వడ్డెర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళి, నేతలు హనుమయ్య, శ్రీనివాసులు, నవీన్ పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఏఎస్పీ రోహిత్ కుమార్

బాధితుల కుటుంబాలకు పరామర్శ



అమరవీరుడి కుటుంబికులను పరామర్శిస్తున్న ఏఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇతర పోలీస్ అధికారులతో కలసి జిల్లా కేంద్రంలోని పలువురు పోలీస్ అమరవీరుల కుటుంబాలను పరామర్శించారు. వారిని సన్మానించి, అండగా ఉంటామని భరోసా నింపారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన హనుమంతరెడ్డి ఉమ్మడి ఏపీలోని గ్రేహౌండ్స్ విభాగంలో జూనియర్ కమాండోగా పనిచేస్తూ..2008లో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో బలిమెల ఘటనలో అమరుడయ్యాడు. ఆయన భార్య స్రవంతి స్థానిక ఆదిమూర్తి నగర్‌లో ఉంటూ... జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తోంది. దీంతో ఏఎస్పీ వారి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించారు. హనుమంతరెడ్డి సేవలను కొనియాడారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీ కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతపురం టూటౌన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నారాయణనాయక్ ఈ ఏడాది జనవరి 17న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన భార్య శాంతబాయి, ఇతర కుటుంబసభ్యులు ఆకుతోటపల్లిలో ఉంటున్నారు. ఏఎస్పీ, ఇతర అధికారులు వారి ఇంటికి వెళ్లి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏవైనా ప్రయోజనాలు అందాల్సి ఉంటే ఎస్పీ జగదీష్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐ శ్రీకాంత్, ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవనమార్గాలను అనుసరించండి

ప్రభుత్వ విప్ కాలవ, ఎంపీ అంబికా

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



విజయ సంకేతం చూపుతున్న నూతన ఉపాధ్యాయులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వాల్మీకి వారసులుగా ఆయన బోధనలు, సూచించిన జీవన మార్గాలను అనుసరించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం ఎన్జీఓ హోంలో వాల్మీకి, బోయ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అక్షర జ్ఞానం లేక దశాబ్దాలుగా అనేక అవమానాలు, ఛీత్కారాలను ఎదుర్కొని నేడు సమాజానికి ఉపయోగపడే స్థాయిలో వాల్మీకి, బోయలు ఎదుగుతుండటం గర్వంగా ఉందన్నారు. తాజాగా జరిగిన డీఎస్సీలో జిల్లా స్థాయిలో నాలుగు విభాగాల్లో వాల్మీకి బోయలు మొదటి స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఐకమత్యంతో ఒకరికొకరు చేదోడువాదోడుగా నిలుస్తూ సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే కర్తవ్యాన్ని అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. అనంతరం డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన జిల్లాకు చెందిన 60 మంది వాల్మీకి బోయ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌సీ అక్కులప్ప, నాయకులు వరప్రసాద్, పవన్‌కుమార్, భాగ్యరాజు, శంకర్‌నారాయణ, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, మలోబన్న, బాలకదిరప్ప, సంగప్ప, రవికుమార్, ఫణి, మంజు, వాల్మీకి ఉద్యోగులు, వాల్మీకి సంఘం నాయకులు బ్రహ్మయ్య, కొండపల్లి అక్కులప్ప, కార్పొరేటర్ రవి, బీసీ సంఘం నాయకులు సాకే నరేష్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల విజేత అనంతపురం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. జూనియర్ బాలుర విభాగంలో గౌతమ్ (అనంతపురం), శివరామ్ (కర్నూలు), జ్యోతినివాస్ (అనంతపురం) మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో శ్రీవల్లి (అనంతపురం), హరిణి (అనంతపురం), ప్రవల్లిక (విశాఖ పట్నం) విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అఖిల్, భగత్, శాంతరాజ్, రామాంజి, తులసి వెంకటేష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రామకృష్ణారెడ్డి

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఆదివారం కర్నూలులో ఏపీ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-6 బాలురలో సంతోష్ 4వ స్థానం, అండర్12 బాలికల విభాగంలో వెనీషా 4వ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో నితీష్ 5వ స్థానం, అండర్-10 బాలికల విభాగంలో జనని, బాలుర విభాగంలో నిహాల్, శ్రీనిక్ రక్షన్ 8వ స్థానాల్లో నిలిచారు. టోర్నీ డైరెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. సీనియర్ చెస్ కోచ్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు విజేతలను అభినందించారు.



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అట్టహాసంగా సిమ్స్ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభం





ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురంరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాయినాథ్ ఇన్‌స్టిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభోత్సవం అట్టహాసంగా సాగింది. అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌లో ఆదివారం ఆస్పత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తదితరులు ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి డైరెక్టర్లు డా.స్వరూపారెడ్డి, అశ్వత్థరెడ్డి, ఉషారాణి, సునీత, సంజనారెడ్డి, అభినవ్‌రెడ్డి, ప్రణీత, వసంత లక్ష్మీ, చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ప్రధాన ఉద్దేశంతో 300 పడకల ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. ఎనిమిది మాడ్యులర్ లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు, వంద పడకల ఐసీయూ సౌకర్యం, 20 పడకల నియోనేటల్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు.

వద్దన్నా డీజే.. టీడీపీ నేతలపై కేసు

ఆలస్యంగా వెలుగులోకి..

అనంతపురం క్రైం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్న సమయంలో డీజే పెట్టకూడదని హెచ్చరించినా.... డీజే పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ పలువురు టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. 9 మంది టీడీపీ ముఖ్య నాయకులతోపాటు మరికొందరిపై ఈ నెల 3వ తేదీ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఈ నెల 3వ తేదీ సుభాష్ రోడ్డులోని టౌన్ అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం వేళ టీడీపీ నాయకులు డీజే ఏర్పాటు చేశారు. ఉత్సవ మండపం వద్ద అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళి, టీడీపీ నేత రాయల్ మురళి, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు క్రిష్ణకుమార్, సుంకర రమేష్, చెన్నప్ప, లోకనాథ్, అనిల్, జయ, మధుసూదన్ గౌడ్‌తోపాటు మరికొందరు ఐచర్‌లో డీజే ఏర్పాటు చేసుకున్నారు. దుర్గాదేవి విగ్రహాన్ని మరో వాహనంలో పెట్టుకుని డీజేతో నగరంలో ఊరేగింపు నిర్వహించారు. నగరంలోని 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుందని పోలీసులు వారించినా... డీజే పెట్టకూడదని హెచ్చరించినా...వాళ్లు ఊరేగింపు కొనసాగించారు. ఈ ఘటనపై అదేరోజు టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై 9 మంది టీడీపీ నాయకులతోపాటు, మరికొందరిపై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను ఆంధ్రజ్యోతి ఆదివారం ఆరా తీయగా.. కేసు నమోదు చేసింది నిజమేనని ఆయన స్పష్టం చేశారు.

న్యూస్ బాక్స్

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్


వీఆర్ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా రాబోవు నాలుగురోజులు భారీ ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేశ్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉందని, మట్టిమిద్దెలలో ఎవరూ నివాసం ఉండరాదన్నారు. పరిస్థితి తీవ్రత తగ్గే వరకు ప్రభుత్వ భవనాలలో ఉండాలన్నారు. చెట్లకింద, కరెంటు స్తంభాల కింద ఉండకూడదన్నారు. గర్భిణుల పరిస్థితిని ఆశాకార్యకర్త లేదా ఏఎన్ఎం కు తెలపాలన్నారు. నీరున్న చెరువులు, కాలువ వద్దకు వెళ్లవద్దన్నారు. ఎలాంటి అసాధారణ పరిస్థితి ఉన్నా తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9553929724కు సమాచారం అందించాలన్నారు. చిత్రావతి నది ప్రాంతాలలో ఉన్న వీఆర్వోలు, ప్రజలు రాబోవు తుఫాన్ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

గొడ్డువెలగలలో పనిచేయని మొబైల్ సిగ్నల్స్

గాండ్లపెంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీలో మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామనీ ఆ పంచాయతీవాసులు వాపో తున్నారు. పంచాయతీలోని మారుమూల గ్రామాల్లోకి వెళితే మొబైల్ సిగ్నల్స్ అందడంలేదంటున్నారు. దీంతో 108, ఫైర్‌స్టేషన్స్, 104 వంటి సేవల కోసం అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, పంచాయతీ అధికారులు వారికి సంబం ధించిన అటెండెన్స్, ఇతర అప్లికేషన్లు ఉపయోగించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామ పంచాయతీ పరిధిలో మొబైల్ సిగ్నల్స్ సమస్యల పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

'ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి'

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. స్థానిక కొత్తపేట శ్రీఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆదివారం శింగనమల నాగమణి జ్ఞాపకార్థం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 300 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఎముకలు, కంటి, దంత తదితర జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంప్ చైర్మన్‌లు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, వైకేశ్రీనివాసులు, రాధాక్రిష్ణ, రామచంద్ర గుప్తా, రామాంజనేయులు, మల్లికార్జున, నాగార్జున పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ధర్మవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డులోని యాదవ వీధిలో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉండేవి. మొత్తం ఐదు స్తంభాలకు వర్షాకాలంలో విద్యుత్‌సరఫరా అవుతుండటంతో స్థానికులు తరచూ ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని టీడీపీ ఆ వార్డు ఇన్‌చార్జ్ అడ్రమహేశ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీ సుకెళ్లారు. దీనిపై స్పందించిన పరిటాల శ్రీరామ్ సూచనతో విద్యుత్ శాఖ ఏఈ చర్యలు చేపట్టారు. ఆదివారం సిబ్బందిని పంపి ప్రమాదకరంగా ఉన్న ఐదు ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటుచేయించారు. టీడీపీ నాయకులు విశ్రాంత జైలర్ వెంకటేశులు పాల్గొన్నారు.


సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వడ్డెర్ల అభివృద్ధికి కృషి

● వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్

కొత్తచెరువు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వడ్డెర్ల అభివృద్ధికి కృషిచేస్తానని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వడ్డె ఓబన్న విగ్రహానికి ఆయనతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు, కూటమి నాయకులు, వడ్డెర్లు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేషన్ చైర్మన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవలే సీఎం చంద్రబాబు బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వడ్డెర్లకు ప్రభుత్వం నుంచి పనిముట్లు, సబ్సిడీ రుణాలను విరివిగా అందించేందుకు వంతు కృషిచేస్తా అన్నారు. వైసీపీ ప్రభుత్వం వడ్డెర కులస్థులను ఓటర్లుగా వాడుకున్నదే తప్ప.. వారి అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు.. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, నాగేంద్రప్రసాద్, మార్కెట్ యార్డ్‌చైర్మన్ పూల శివప్రసాద్, మాణిక్యంబాబా, గోపాల్‌రెడ్డి, కేశప్ప, పాపన్న, వెంకటనారాయణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● ఎస్‌బీఐ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు, సిబ్బంది

ధర్మవరం, అక్టోబరు 26((ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉండగలరని ఎస్‌బీఐ ధర్మవరం రీజనల్ మేనేజర్ శశిధర్‌కుమార్ అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 6.0 స్వచ్ఛతసే స్వచ్ఛతకి ఓట్ అన్న కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం ధర్మవరంలో ఎస్‌బీఐ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పరిశుభ్రత నుంచి ఆరోగ్యం వైపు ఎలా ఉండాలి అనే అంశం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శశిధర్‌కుమార్ మాట్లాడు తూ... ఈనెల 2న గాంధీజయంతిని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలతో చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో చీఫ్ మేనేజర్లు వైవీ నాయుడు, రాంప్రసాద్, హెచ్‌ఆర్ మేనేజర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్

● ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రోడ్డుపైనే ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఆ రోడ్డు వెళ్లే వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు రిజిస్ట్రేషన్‌ల కోసం ఎంతోమంది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. ఆ కార్యాలయం రెండో అంతస్తులో ఉంది. దీంతో రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చే వారు వాహనాలను కింద ఉన్న దుకాణాల ఎదుట నిలిపివెళ్తున్నారు. దీంతో దుకాణదారులు తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు తదితర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా ఆ రోడ్డు వెంట వెళ్తాయి. అయితే రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాహనాలు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య జఠిలమై ప్రయాణికులు, వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడానికి సంబంధిత అధికారులు ఏదో ఒక స్థలం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుల ధైర్యం స్ఫూర్తిదాయకం

● వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

● కర్నూలు బస్సు ఘటనలో ప్రాణాలను కాపాడిన యువకులకు సన్మానం


యువకులను సన్మానించిన మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘోర బస్సు ప్రమాద సమయంలో ధర్మవరం యువకులు చూపిన ధైర్యం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. కర్నూలు వద్ద రెండురోజుల క్రితం జరిగిన బస్సు ప్రమాదంలో పదిమందికి పైగా ప్రాణాలను కాపాడిన ధర్మవరం యువకులను మంత్రి సన్మానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రయాణికులను కాపాడిన హరీశ్‌కుమార్, జ్ఞానేంద్ర, వంశీల ఇళ్లకు వెళ్లి అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్న వేళ, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బస్సులో చిక్కుకున్న వారిని బయటకు లాగి రక్షించిన ఈ యువకుల చర్య మానవత్వానికి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. సమాజంలో ఇలాంటి ధైర్యవంతులైన యువకులు ఉండటం గర్వకారణం అన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

ధర్మవరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం రాత్రి రెవిన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి మాట్లాడుతూ...నియోజకవర్గం అభివృద్ధి పట్ల మన బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. ప్రతివార్డు, గ్రామ ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరేలా అధికారులు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో జరుగుతున్న పనులపై త్వరలో నివేదికలు సమర్పించాలన్నారు. ధర్మవరాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ప్రభుత్వం కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. నాణ్యత ప్రధాన ప్రమాణంగా పనులు ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్లు సురేశ్, నారాయణ స్వామి, స్వర్ణలత, భాస్కర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కొద్దేవర ఉత్సవం


గొడ్డెమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

తనకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని ఒడ్డుమొ రవపల్లి, చిన్నపల్లి, పడమటివారిపల్లి, గందోడివారిపల్లి, దండువారి పల్లిల్లో ఆదివారం కొద్దేవర ఉత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ఉదయం నుంచి ఉపవాసం ఉన్న మహిళలు మధ్యాహ్న సమయంలో నీరున్న ప్రాంతానికి వెళ్లి, ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, పుట్టమన్నుతో తయారు చేసిన నూర్పిడితో బొట్టుపెట్టుకున్నారు. ఆయా గ్రామాలకు ఇరువైపులా ఉన్న గొడ్డెమ్మ దేవత శిల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పోతుల సురేష్‌కు సన్మానం

నల్లమాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మైలే శివ శంకర్ నివాసం వద్ద ఆదివారం బీజేపీ నాయకుడు పోతుల సురేష్‌ను కూటమి నాయకు లు పూలమాల, దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పోతుల సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రగతివైపు ప్రయాణిస్తోందని అన్నారు. మైలే శివశంకర్‌తో పాటు బుట్టి నాగభూషణం నాయుడు, లక్ష్మయ్య, మైలే రామచంద్ర, పాపారాయుడు, అరవింద్‌బాబు, ఏపి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేనేత ప్రముఖులకు..

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసేపేటకు చెందిన చేనేత ప్రముఖులు పల్లెం వేణుగోపాల్, పల్లెం కృష్ణను ధర్మవరం మాజీ ఎంపీపీ కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల పల్లెం కృష్ణ వాణిజ్య రంగంలో యూత్ ఎక్సలెన్స్ అవార్డును హైదరాబాద్ వారిచే అందుకున్నారు. దీంతో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, యూత్ బృందం పల్లెం వేణుగోపాల్, పల్లెం కృష్ణను శాలువాతో సత్కరించి అభినందించారు.

టీడీపీ నాయకులకు మంత్రి పరామర్శ

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు, చెన్నకేశవస్వామి ఆలయ అడహాక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్ తీవ్రంగా గాయపడి చికిత్సలు పొందారు. ప్రస్తుతం ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యా దవ్ ఆదివారం వారిద్దరి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరముంటే అందుబాటులో ఉంటానని మంత్రి సూచించారు.

సీజీపీ నుంచి నీటి విడుదల


ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

తనకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముండ్లవారిపల్లి సమీపంలో పాపాగ్ని నదికి అడ్డంగా నిర్మించిన సీజీ ప్రా జెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. పది రోజులుగా కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వందమానేరు, పాపాగ్ని నది ప్రవహించడంతో డ్యాంకు పూర్తి స్థాయిలో నీరుచేరింది. దీంతో మూడు రోజుల నుంచి ప్రతి రోజు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం 120 క్యూసెక్కులు, ఆదివారం 200 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు సంబంధిత ఇంజనీర్ బయప్ప తెలిపారు. ప్రాజెక్ట్ కింద 1100 ఎకరాల సాగుభూమి ఉందని, ఈ ఏడాది మొత్తం భూమిని సాగు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల్లో కోచింగ్ క్యాంపు జట్టు విజయం

కదిరి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీలలో చాలెంజర్స్ జట్టుపై కోచింగ్ క్యాంపు ఫైటర్స్ జట్టు విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. వీరిలో సాయి ప్రణీత్ 58, ప్రణయ్ 45 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన చాలెంజర్స్ జట్టు 110 పరుగులు చేసి ఓటమి పాలైంది. విజేత జట్టును పలువురు అభినందించారు.

మహిళా భద్రతపై పోలీసుల చర్యలు

● జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు


జిల్లా కేంద్రంలోని హాస్టల్‌లో మాట్లాడుతున్న సీఐ శివాంజనేయులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, నేరాలను పూర్తిగా అరికట్టే దిశగా జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేరస్థులను, రౌడీషీటర్లను పోలీసుస్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ ఓ ప్రకటనలో తెలియచేస్తూ... మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తనను మానుకోవాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరస్థుల్లో సానుకూల మార్పులు రావాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో మహిళల భద్రత, సామాజిక శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పో లీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఆ మేరకు పోలీసు అధికారులు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.


● బత్తలపల్లి: మండలపరిధిలోని రామాపురం గ్రామంలో ఆదివారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు, మహిళల పట్ల అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలు, సైబర్ నేరాలపై డీఎస్పీ హేమంత్ కుమార్ ఎల్‌ఈడీ డిస్‌ప్లే ద్వారా అవగాహన కల్పించారు. సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ పాల్గొన్నారు.

● ధర్మవరం: వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ ఆది వారం పట్టణంలో ఆదివారం ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న, లైసెన్స్‌లు లేని మొత్తం 28 ద్విచక్ర వాహనదారులను పట్టుకున్నారు. మైనర్లు నడిపితే బైకులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

● నల్లచెరువు: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మండలంలోని ఆటోడ్రైవర్లను ఎస్ఐ మగ్బూల్ బాషా హెచ్చరించారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

● తనకల్లు : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆదివారం ఎస్ఐ గోపి.. పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మండల పరిధిలోని నారేవాండ్లపల్లి సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,150 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లేపాక్షికి పోటెత్తిన పర్యాటకులు



- స్వామి, అమ్మవార్ల దర్శనానికి బారులుతీరిన భక్తులు

లేపాక్షి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో ఆలయం బోసిపోయింది. ఆదివారం వర్షం పడకపోవడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ అర్చకులు దుర్గా, వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు.

ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తులు, పర్యాటకుల సందడి

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

సీజీపీ నుంచి నీటి విడుదల

తనకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీజీ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వందమానేరు, పాపాఘ్ని నది ప్రవహించడంతో డ్యాంకు పూర్తి స్థాయిలో నీరుచేరింది. దీంతో మూడు రోజుల నుంచి ప్రతి రోజు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం 120 క్యూసెక్కులు, ఆదివారం 200 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు సంబంధిత ఇంజనీర్ బయప్ప తెలిపారు.

'పంచాయతీకి ఆదాయం తీసుకొద్దాం'



మన్రో తోపులో ఆక్రమణలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, పీఏ వీరయ్య

చిలమత్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపులో కొందరు స్థలాలను ఆక్రమించుకొని సొంత లాభం పొందుతున్న విషయం రచ్చకెక్కడంతో ఎట్టకేలకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆక్రమించుకుని, అందులో నిర్మాణాలు చేసుకున్న కొందరు.. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, పీఏ వీరయ్యను ఆశ్రయించారు. దీంతో వారు ఆదివారం కోడూరు మన్రో తోపుని సందర్శించారు. రోడ్డు పక్కన మన్రో తోపు స్థలాలను ఆక్రమించుకొని చేసుకున్న నిర్మాణాలను పరిశీలించారు. ఆక్రమణలను తొలగించడమా? ఉన్న నిర్మాణాలతో పంచాయతీకి ఆదాయం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవడమా అనే విషయాలపై పంచాయతీ అధికారులతో చర్చించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పంచాయతీకి ఆదాయం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీ మోహన్, ఎంపీడీఓ రమణమూర్తి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, బేకరీ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, జనసేన నాయకులు చిన్న ప్రవీణ్, ఎల్ఐసీ రమణ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డుపై మురుగునీరు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రొద్దం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల నడిబొడ్డున సీసీరోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రొద్దంలోని మార్కెట్ స్థలంవద్ద డ్రైనేజీ సౌకర్యం సరిగాలేకపోవడంతో పైనుంచి వచ్చిన మురుగునీరు స్టోరేజ్ అవుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. ఆ ప్రాంతంలో దుకాణాలు ఎక్కువగా ఉండటంతో వచ్చిపోయే జనాలకు అసౌకర్యంగా ఉందని, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయరూ..



గుంతలు పడ్డ మందపల్లి రోడ్డు

గుడిబండ, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి, ఎస్ రాయాపురం గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది దీంతో కురిసిన వర్షపు నీరు గుంతలో నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గుంతలపడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

- మండల కన్వీనర్ నాగరాజు



గౌడనహళ్లిలో కార్యకర్తలతో సమావేశమైన నాగరాజు

మడకశిర రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బేగార్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని 16 పంచాయితీలో పర్యటించి నాయకులతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

యాదవ సంఘం గౌరవాధ్యక్షుడి మృతి



రాంప్రసాద్ (ఫైల్)

పెనుకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం మండల గౌరవాధ్యక్షుడు రాంప్రసాద్(68) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. శనివారం ఆయన అనారోగ్యానికి గురికావడంతో అనంతపురంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, మాజీ ఎంపీపీ నాగలూరు నారాయణస్వామి, పెనుకొండ మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, యాదవ సంఘం నాయకులు ఆంజనేయులు, కృష్ణమోహన్, కోగిర జయచంద్ర, లక్ష్మీకాంత రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ నివాళులు అర్పించారు.

రైతులకు పట్టాలివ్వాలి

- రైతుసంఘం నాయకులు

పావగడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాలూకావ్యాప్తంగా భూమిలేని పేద రైతులు సాగు చేస్తున్న భూములకు తహసీల్దార్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టాలు అందించాలని సోమవారం ధర్నా చేస్తున్నట్లు జిల్లా రైతు సంఘం నాయకుడు పూజారప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాలూకా కార్యాలయం ముందు జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. స్థానిక ఐబీ నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తారన్నారు. గడిచిన 30ఏళ్ల నుండి భూమిలేని రైతులు సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు మంజూరుచేయలేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, తహసీల్దార్ చొరవ తీసుకుని రైతులు చేస్తున్న సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ధర్నాలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదికను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు. మండల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందించవచ్చన్నారు. అధికారులు అందుబాటులో ఉంటారని, అర్జీలు అందించి పరిష్కరించుకోవచ్చన్నారు.

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదికను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కారాన్ని పొందవచ్చన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతి సర్పంచ్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో 30మంది టీడీపీలోకి చేరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత వీరికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సవిత సారథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఈ క్రమంలోనే ఆకర్షితులై పార్టీలోకి చేరామన్నారు.

వైభవంగా వాల్మీకి జయంతి



కొట్నూరులో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కొట్నూరులో ఆదివారం వాల్మీకి మహర్షి జయంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, పీఏ వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వమానవాళికి పరివర్తన మార్గాన్ని రామాయణ మహాగ్రంథం ద్వారా తెలియజేసిన మహనీయుడు వాల్మీకి అని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు ఊరేగింపుగా తీసుకెళ్లి వాల్మీకి ఆలయంలో సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఆదినారాయణ, సూరి, శేఖర్, రాజు, సోము, నంజుండ, వేణు, శంకర్, కౌన్సిలర్ మల్లికార్జున పాల్గొన్నారు.